

# అమెరి'కా'లేజ్ కథలు

## - లిపి మల్లాది



*అమెరికాలో కాలేజీ చదువంటే ఒకప్పుడు గగనకుసుమం, అదో ఇంద్రజాలం. గత రెండు, మూడు దశాబ్దాల్లో అమెరికాలో చదువుకోసం వస్తున్న విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరగడమే కాక, ఇండియాలో కూడా ఒక మాదిరిగా చదువుకున్న కుటుంబాల్లో దాదాపు ప్రతి ఇంటికీ కనీసం ఒకరైనా అమెరికాలో చదువుకుంటున్న పిల్లలుంటున్నారు. ఇంటర్నెట్ అరచేతిలోకొచ్చేసిన ఈ రోజుల్లో అమెరికాలో కాలేజీలు ఎలా ఉంటాయో, అక్కడ డార్మ్స్ ఎలా ఉంటాయి, స్టూడెంట్స్ జీవితాలు ఎలా ఉంటాయో... అనే విశేషాలు అతి సులువుగా తెలిసిపోతున్నట్లనిపిస్తున్నాయి. ఐనా మొదటిసారి చదువుకోసం అమెరికా వచ్చే ప్రతి విద్యార్థికీ ఎవరి అనుభవం వారిదే, ఎవరి ఇబ్బందులు వారివే, ఎవరి స్నేహాలు వారివే. ఈ నేపథ్యంలో అమెరికాలో చదుకోసం వచ్చిన ఓ సాధారణ మధ్యతరగతి అమ్మాయికి ఎదురైన సంఘటనలు, సన్నివేశాలు.. స్నేహాలు, సంతోషాలు.. సరదాలు.. వెరసి ఇవన్నీ అమెరికాలేజీ కథలు. స్వానుభవాలనూ, విన్న అనుభవాలనూ, చూసిన అనుభవాలనూ - ఆసక్తికరమైన కథలుగా కౌముది పాఠకులకు అందిస్తున్నది లిపి మల్లాది. 'నా కళ్ళతో నాన్న ' ధారావాహికతో కౌముది పాఠకుల అభిమానాన్ని సొంతం చేసుకున్న లిపి మల్లాది ఈ ధారావాహికతో మీకు మరింత చేరువౌతుందని ఆశిస్తూ..*

*- సంపాదకుడు*

*(క్రిందటి సంచికనుంచి కొనసాగింపు)*

**అన్నయ్య** కారు డిక్కీలో సూట్‌కేసులు పెడుతుండగా నేను కారెక్కి కూర్చున్నాను. అంతసేపు విమానంలో కూర్చోడం వల్లేమో సీటు లోతుగా ఉన్నట్టు అనిపించింది. అలా ఒక్క సెకండు గడిచాక గానీ నాముందున్న స్టీరింగ్ వీల్‌ని నేను గమనించలేదు. వెంటనే కారు దిగేలోపు అన్నయ్య తలుపు తెరిచి "ఒసేయ్, నువ్వు డ్రైవ్ చేస్తావా?" కాస్త నవ్వుతూ కాస్త సీరియస్‌గా అడిగాడు.

"మర్చిపోయను. సారీ" అని పక్కసీటులోకి ఎక్కాను.

కార్ స్టార్ట్ చేస్తూ ఫోన్‌లో ఓ చాట భారతం అంత నంబర్‌ని డయల్ చేసాడు. కొన్ని క్షణాలకి ఫోన్ రింగ్ వినబడింది. ఆ రింగు అమ్మ హలో అనడంతో ఆగింది. విచిత్రంగా నాకు ఏడుపు రాలేదు. అమ్మ గొంతు మాత్రం ఏడుపుకి బొంగురుపోయింది పాపం.

"నీ ఫోన్ కోసం వెయిట్ చేస్తూ నాన్న ఇంకా నిద్రపోలేదు" అన్నప్పుడు మాత్రం కళ్ళు కాస్త తడయ్యాయి. వాళ్ళకి అర్ధరాత్రి కావడంతో కేవలం టెన్‌మినిట్స్ మాత్రమే మాట్లాడాము.

"అలసిపోయావా?" అని అన్నయ్య అడిగాడు.

"లేదు" అన్నాను.

"ఆకలేస్తుందా?"

"లేదు"

"అయితే ఇంటికి లాంగ్ రూట్‌లో వెళ్దాం. నీకొక సూపర్ డూపర్ సీనరీ చూపిస్తా" అన్నాడు.

ఇండియాలో ఉన్నప్పుడు లింకిన్ పార్క్, మెటాలికా పాటలు విన్న అన్నయ్య కారులో జోధాఅక్బర్ పాటలు వినబడడం కాస్త షాకింగ్ ఉంది. ఇండియాలోలా కాక రోడ్ మీద కార్లు అటువైపు వెళ్ళడం ఎన్నో సినిమాల్లో చూసినా, కారులో వెళుతుంటే ఏదో రాంగ్ రూట్‌లో వెళ్తున్న ఫీలింగ్ కలిగింది. అన్నయ్య లేన్ మారుతుంటే వెనక వచ్చే కారు గుద్దేస్తుందేమో అని ఎంతో భయపడి దాదాపు అరిచాను.

"భయపడకే ప్రాణం మీద తీపి నాకూ ఉంది" అన్నయ్య నవ్వాడు.

"నాకేం భయంలేదు" నేను నవ్వినా, కారు స్పీడ్ తగ్గించడం గమనించాను. సాంబారులో ములక్కాయ కూడా నానుండి లాక్కున్న అన్నయ్యేనా తిను? అని ఎంతో ఆశ్చర్యపోయాను.

కొన్ని నిమిషాలయ్యాక "రెడీ ఆ?" అడిగాడు.

"దేనికి?" అని అయోమయంగా అడిగాను.

"నేచర్‌కి" అన్నాడు.

"నేచరా? నేచర్ కాలా?" కాస్త సిగ్గుపడుతూ అడిగాను.

"ఒసేయ్, పిచ్చిముద్దు. బయటికి చూడు" అని నవ్వాడు. తలతిప్పి ఓ రెండు నిమిషాలు నోరు తెరిచి ఆశ్చర్యపోయాను.

"ఆవిలిస్తున్నావా? ఆస్వాదిస్తున్నావా?" అని అన్నయ్య అనడంతో తిరిగి మన ప్రపంచానికి వచ్చాను.

వావ్! ఎంత బావుందన్నయ్యా" అని నన్ను నేను మరచి ప్రకృతిని ఆస్వాదించాను. పచ్చటి గడ్డి, అశోకా చెట్లులాంటి ఎన్నో వందల చెట్లు, చుట్టూ మౌంటెన్స్, ఆ మౌంటెన్స్ మీద కూడా అక్కడక్కడా పెరిగిన చెట్లు, గడ్డి. ఎంత అందంగా ఉందో. ఎంత ప్రశాంతంగా ఉందో. ఇలాంటి ప్లేస్ వల్లే మోనేకి ఇన్స్‌పిరేషన్ వచ్చిందేమో. ఇలాంటి చోటే ఓ చెట్టు కింద కూర్చుని జాయ్‌స్ కిల్మర్ "పోయెంస్ ఆర్ మేడ్ బై ఫూల్స్ లైక్‌మి, ఓన్లీ గాడ్ కెన్ మేక్ ఎ ట్రీ" అని రాసుంటారు కాబోలు. ఎంతదూరం వెళ్ళినా మౌంటెన్స్ అంతే దూరంలో ఉన్నాయి. ఆ దూరం జరిగిపోతే ఇంకెంత బావుంటుందో. ఈ అందాన్ని వర్ణించడం కృష్ణశాస్త్రికి కూడా కష్టమే కాబోలు. ఇదే స్వర్గమేమో. ఇక్కడే ఉండిపోవడానికి జీవితాంతం తపస్సు చెయ్యడంలో తప్పేలేదు.

"అన్నయ్యా, ఈ గడ్డిలో నడవచ్చా?" కుతూహలంతో అడిగాను.

"నడవచ్చే. ఇంకో రోజు వద్దాం" అన్నాడు.

"ఇప్పుడే వెళ్దాం అన్నయ్యా" జాలి మొహంతో అడిగాను.

"సరే, కానీ అమ్మమ్మ పెట్టిన ఆవకాయ, నీకు ఇష్టమైన మడతకాజా కారులో వేడికి పాడైపోతాయి మరి. నీ ఇష్టం" అన్నాడు.

"అబ్బా ప్లీజ్ అన్నయ్యా ఒక్క టెన్ మినిట్స్ దిగుదాం" అని మారాం చెయ్యడంతో

"ఓన్లీ టెన్ మినిట్స్" అని ఒప్పందం కుదుర్చుకుని కారుని పక్కకి ఆపాడు.

కారు కిటికీ అద్దం ఈ ప్లేస్ బ్యూటీని చూపించలేకపోయింది. ఆ గడ్డివాసన, అక్కడక్కడ పక్షికూతలు, అన్నిటికన్నా ముఖ్యంగా గాలి. నాచురల్ ఎయిర్‌కి నేను ఒక కంప్లీట్ డే దూరంగా ఉన్నానని గుర్తొచ్చింది. ఆకాశంలో క్లౌడ్స్ బీచ్‌లో వేవ్స్‌లా ఉన్నాయి. నాకే కవిత్వం పుట్టుకొస్తుంది అంటే ఇంక ఊహించుకొండి. ఆ గడ్డిలో నేను పిచ్చిదానిలా పరుగెత్తినా అన్నయ్య పాపం ఏమీ అనలేదు. ఇంత

అందమైన చోటు చూడ్డం నా జీవితంలో ఇదే మొదటిసారి అని తెలుసు కాబట్టి నన్ను ఆపలేదేమో. నా సంతోషాన్ని చూసి అన్నయ్య పెద్దగా నవ్వాడు.

"ఇక్కడ నుంచోవే, నీకో ఫోటో తీస్తాను" అనడం ఆలస్యం, "ఇక్కడ ఒక్కటి తియ్యి, అక్కడ ఒకటి తియ్యి.. వెనక్కి వెళ్తా.. ముందుకొస్తా" అంటుంటే ఓ పది, పదిహేను ఫోటోలు ఓపికగా తీసాక "ఎక్కడ తీసినా అంతా గడ్డేనే. అన్ని ఫోటోలు ఒకటేలా ఉంటాయి. మనం ఇంటికి ఇంకా చాలా దూరం వెళ్ళాలి పద" అంటూ కారెక్కాడు. నేను ఎగురుతూ, గెంతుతూ కారెక్కడం చూసి "ఎవరైనా తెలుగువాళ్ళు చూస్తే నిన్ను చంద్రముఖి ఆవహించిందనుకుంటారు" అని అన్నయ్య ఎగతాళి చెయ్యడం విచిత్రంగా నాకు కోపం కలిగించలేదు.

"వింటర్‌లో ఆ మౌంటెన్స్ మీద అంతా మంచే ఉంటుంది. ఆ గ్రీనరీ అసలు కనిపించదు" అని అన్నయ్య చెప్పాడు.

ఆ వ్యూని ఊహించుకుంటూ మొదటిసారి కారెక్కిన కుక్కలా తల, నాలుక బయటపెట్టి మౌంటెన్స్‌ని కొన్ని సెకండ్లు చూసాను.

"అన్నయ్య నువ్వు ఇలాంటి చోట ఇల్లు కట్టుకోవచ్చుకదా" అని అడిగాను.

"ఇళ్ళు కట్టుకునే మన ఊళ్ళో బిల్డింగు తప్ప ఏమీ లేవు" అన్నాడు.

"ఓ, కరెక్టే. నువ్వు ఇక్కడికి రోజూ వస్తావా?" అని అడిగాను.

"ఓ కరెక్టే. నువ్వు ఇక్కడికి రోజూ వస్తావా?" అని అడిగాను.

"ఇది నా ఆఫీస్ రూట్. ఇక్కడ్నించి ఓ సిక్స్ మైల్స్ ఉంటుంది" అన్నాడు.

"ఈవినింగ్ ఇక్కడ వాక్ చేస్తావా?" అని అడిగాను.

"ఈవినింగ్ ఇంక ఓపిక ఉండదు. వీకెండ్స్ వేరే చోట హైక్ చేస్తాను"

"వేరే ప్లేస్ ఎందుకు? ఇక్కడికే రావచ్చుగా?"

"రోజూ ఆఫీస్‌కి వెళ్తూ, వస్తూ చూస్తాను కదా. వీకెండ్స్ ఛేంజ్ ఆఫ్ సీనరీ"

"కానీ ఇదెంత బ్యూటిఫుల్‌గా ఉంది"

"అది దీనికన్నా బ్యూటిఫుల్. రేపు సాటర్‌డేనేగా. నీకు జెట్‌లాగ్ లేకపోతే తీసుకెళ్తాను" అన్నాడు.

"ఇంతకన్నా బ్యూటిఫుల్లా?" అని ఆలోచనలో పడ్డాను.

"ఔను. రేపు చూస్తావుగా" అన్నాడు.

ఇంతకన్నా అందం నా తరమా అంటూ మళ్ళీ కవితలు పుట్టాయి. ఇంక జెట్‌లాగ్ ఎందుకుంటుంది నాకు? మేబీ ఇంకొన్ని ట్రీస్ ఉంటాయేమో, లేకపోతే గడ్డిపొడుగ్గా ఉంటుందేమో? ఆలోచనలో ఓ పదినిమిషాలు కళ్ళు మూసుకున్నాను.

"లేవే ఇల్లొచ్చేసింది" అని అన్నయ్య అన్నాడు.

"అంత దగ్గరా మౌంటెన్స్?" అని అడిగాను.

"కాదు. అంత దూరం" అని పక్కకి చూడమని సైగ చేసాడు.

"ఇందాక అంత దూరంలేవుగా?" అని కన్‌ఫ్యూజ్ అయ్యి అడిగాను.

"అరగంట పడుకున్నావుగా. వాటికి కోపమొచ్చి వెళ్ళిపోయాయి" అని సర్కాస్టిక్‌గా అన్నాడు.

అరగంట పొళ్ళు తెలియకుండా నిద్రపోయానా అని ఆశ్చర్యపోయాను.

షాపుకెళ్ళి పాలపేకెట్ కూడా నా బదులు కొనని అన్నయ్య నా రెండు సూట్‌కేసులూ తనే మోస్తూ రెండు ఫ్లోర్లు ఎక్కాడు.

అన్నయ్య తలుపు తెరిచినప్పుడు లోపల ఎంత చెత్త ఉందో, క్లీన్ చెయ్యడానికి ఎన్నిరోజులు పడుతుందో అని భయపడుతూ కాలుపెట్టేముందు తొంగి చూసాను. సినిమాల్లో చూపించినట్టు, ఇండియాలో అన్నయ్య రూంలా చిందరవందరగా లేదు. అన్నయ్య ఇల్లేనా అని కొన్ని నిమిషాలు ఆశ్చర్యపోయాను.

నా మైండ్ చదివినట్టు "నా ఇల్లే. నువ్వొస్తున్నావని నిన్నే సర్దాను" అన్నాడు.

నా రూంలో పక్క దుప్పటి పీకేసి, టేబుల్ మీద పేపర్లు విసిరేసిన అన్నయ్యేనా అని మళ్ళీ షాక్ తిన్నాను. ఈ అన్నయ్య వల్ల నేను రబ్బరు చెప్పులు బదులు చెక్క చెప్పులు వేసుకోవాల్సొస్తుందేమో? లోపల అడుగు పెట్టి చుట్టూ చూసాను. ఒక గ్రే సోఫా, దానిముందు ఒక అందమైన ఫ్లవర్ వాజ్ తప్ప ఏమీలేని టీపాయ్, ఎదురుగా ఒక టీవీ. టీవీ స్టాండ్‌లో అన్నయ్య వెళ్ళిన ఊళ్ళో కొన్న షాట్ గ్లాసెస్ ఉన్నాయి. తెల్లటి కార్పెట్ మీద ఒక్క మరకకూడా లేదు. నేను ఇక్కడ ఉన్నన్ని రోజులూ ఎంతో జాగ్రత్తగా తినాలన్నమాట. కిచెన్ విడిగా గదిలా కాక హాల్లో భాగంగా ఉండడం విచిత్రంగా అనిపించింది.

"కిచెన్‌కి తలుపు లేదా?" అని అడిగాను.

"అమెరికాలో చాలా వరకు కిచెన్లు ఇలానే ఉంటాయి. దీన్ని ఓపెన్ కిచెన్ అంటారు" అని చెప్పాడు.

"కిచెన్‌లో కిటికీ లేదేంటి?" అని అడిగాను.

"ఇక్కడ అంతే. ప్రతి గదిలో మనలా కిటికీలు ఉండవు. అన్నీ ఎయిర్ కండీషన్డ్"

"మరి వంటచేసేప్పుడు పొగొస్తే?"

"స్టవ్‌కి ఎక్జాస్ట్ ఉంటుంది. అలానే బాల్కనీ తలుపు కూడా తెరుస్తాను."

ఫ్రిడ్జ్ తెరిచి చూస్తే చాలా ఖాళీగా ఉంది. "అదేంటి? ఏం లేవు?" అని అడిగేసరికి అన్నయ్యకి కోపం వచ్చి "లెఫ్ట్‌లో జింజర్ ఏల్, నీళ్ళు కనిపించట్లేదా? లేదా టుగో బాక్స్ కనబడట్లేదా?" అని కోపంగా అడిగాడు.

"అంటే వెజిటబుల్స్ లేవని అడిగాను" అని బిక్కు బిక్కుమంటూ అడిగాను.

"నాకు రోజూ వంటకి టైం ఉండదు. ఫ్రోజెన్ ఫుడ్ తింటాను" అని కాస్త విసుగ్గా అన్నాడు.

ఫ్రీజర్ తలుపు తెరవగానే మూడు డబ్బాలు కిందపడ్డాయి. "ఐయాం సారీ. సారీ" వాటిని ఎత్తి పెడదామంటే చోటులేదు. నా అయోమయానికి నవ్వి వాటిని చేతుల్లోంచి తీసుకున్నాడు.

"చికెన్ నగెట్స్ తింటావా?" అని అడిగాడు.

"నన్ను చికెన్ తింటావా అని అడుగుతున్నావేంటి?" అని కాస్త కోపంగా అడిగాను.

"ఇవి వెజిటేరియన్" అన్నాడు. నేను నమ్మకపోవడంతో ఇంగ్రిడియంట్స్‌ని చూపించి "ఇక్కడ వెజిటేరియన్ మీట్ దొరుకుతుంది. అదే మనకి ప్రొటీన్" అని చెప్పాడు. వెజిటేరియన్ మీట్ ఏంటి? అని కల్చర్ షాక్ కలిగింది.

బాల్కనీలో నిలబడి మౌంటెన్స్‌ని చూస్తుండగా అన్నయ్య వచ్చాడు.

"ఇక్కడ ఎంత రిలాక్సింగ్‌గా ఉందో" అన్నాను.

"ఇక్కడ డస్ట్ స్టార్మ్స్, హెవీ విండ్స్ వస్తాయి. ప్రకృతి ఎప్పుడూ ఇంత ఆహ్లాదంగా ఉండదు. లోపలికిరా తిందాం" అన్నాడు.

మొదట డస్ట్ స్టార్మ్స్‌కి, తరువాత అన్నయ్య ప్రకృతి, ఆహ్లాదంలాంటి పదాలు వాడినందుకు ఆశ్చర్యపోయాను. ఇండియాలో ఉన్నప్పుడు తను అలాంటి వర్డ్స్ వాడటం నాకు గుర్తులేదు.

తిన్న వెంటనే నిద్రముంచుకొచ్చింది. కనీసం 7వరకు అన్నయ్య మెలుకువగా ఉండమన్నాడు. స్నానం చేస్తే నిద్రపోతుందనుకున్నాను కానీ తెలియకుండానే సోఫాలో నిద్రలోకి జారుకున్నాను.

Click here to share your comments on this story